క్లుప్తంగా

మున్సిపల్ డీఈగా సురేష్



రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలక సంఘం డీఈగా సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ డీఈగా పని చేస్తున్న రామ్మూర్తి అన్నమయ్య జిల్లాకు బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో కళ్యాణదుర్గం డీఈగా ఉన్న సురేష్ డెప్యూటేషన్ (ఎఫ్ఏసీ)గా బాధ్యతలు స్వీకరించినట్లు కమిషనర్ దివాకర్‌రెడ్డి తెలిపారు.

శుభకార్యం

విడపనకల్లు: కరకముక్కల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కురుబ రామన్న మనవడు రామాంజినేయులు వివాహానికి ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వర రెడ్డి బుధవారం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సర్పంచు రామాంజినేయులురెడ్డి, కరణం భీంరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ భరత్‌రెడ్డి, ఎంపీటీసీ ఓబులేసు, మల్లికార్జున, హంపయ్య, రామాంజినేయులు పాల్గొన్నారు.

హులిగమ్మ దేవి విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం



నవగ్రహ హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్‌లో దాత సహకారంతో నూతనంగా నిర్మించిన హులిగమ్మ దేవాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభమయ్యాయి. గంగాజలాన్ని ఊరేగిపుంగా తీసుకొచ్చి గంగ పూజ, గణపతి పూజ, కంకణధారణ, నవగ్రహ పూజ, కంకధారణ, నవ గ్రహపూజ, ప్రధాన కలశ స్థాపన, పంచామృతాభిషేకం చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. గురువారం చండీ పారాయణం, చండీ హోమం, విగ్రహ ఊరేగింపు జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

8 నుంచి విజ్ఞాన శిబిరాలు



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమమోహన్ రెడ్డి

కుందుర్పి: స్థానిక గ్రంథాలయాన్ని బుధవారం ఉదయం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ ఉమమోహన్ రెడ్డి తనిఖీ చేశారు. ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకూ ఉమ్మడి జిల్లాల వ్యాప్తంగా శాఖా గ్రంథాలయాల్లో పాఠశాల విద్యార్థులకు విజ్ఞాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకూ కథలు చెప్పడం, పుస్తక పఠనం, చిత్రలేఖనం, పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ మారుతేశ్వరి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేంద్ర, అంజి, రమేష్, గ్రంథాలయ అసిస్టెంట్ భాస్కర్ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలి



మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: సమష్టిగా మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి సూచించారు. ఉరవకొండ మార్కెట్ యార్డ్ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన పి.చిదంబరి బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డిని కలిసి సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దాసునాయక్, తిరుమలేష్ నాయక్, శీనా నాయక్, రామ కృష్ణానాయక్, కుళ్లాయి స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

వజ్రకరూరు: వజ్రకరూరు మేజర్ పంచాయతీలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ ఎం.గౌతమిని సర్పంచు మోనాలిసా కోరారు. బుధవారం వజ్రకరూరు పర్యటనకు వచ్చిన జిల్లా కలెక్టర్‌ను ఆమె కలిసి, వినతిపత్రం అందజేశారు. అటవీ భూములు సాగు చేస్తున్న గిరిజన రైతులకు సాగుహక్కు పట్టాలు మంజూరు చేయాలని ఎంపీపీ రమావత్‌దేవి కలెక్టర్‌ను కోరారు. వజ్రకరూరు, వెంకటాంపల్లి పెద్ద తండాలో శ్మశాన వాటికలకు స్థలాలు మంజూరు చేయాలని విన్నవించారు.

వెండి శఠగోపం వితరణ

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీ నృసింహ స్వామికి బుధవారం కర్నూలు నగరానికి చెందిన అభిష్ఠ గణపతి మేనేజింగ్ ట్రస్టుకు చెందిన జంపాల మధుసూధన్, శ్రీకాంతి దంపతులు అరకిలో వెండి శఠగోపాన్ని బహుకరించారు. ఈఓ విజయ్‌కుమార్, అర్చకులు ద్వారకనాథచార్యులు, బాలాజీస్వామి పాల్గొన్నారు.

చెట్టులో కొలువైన 'నృసింహుడు'

- భక్తుల కొంగు బంగారంగా విరాజిల్లుతున్న కోట లక్ష్మీ నరసింహ స్వామి
- నేటి నుంచి జయంత్యుత్సవాలు
- రెండ్రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు



ముస్తాబైన లక్ష్మీ నృసింహస్వామి ఆలయం



వేపచెట్టులో లక్ష్మీ నృసింహుడి ఆకారం

కళ్యాణదుర్గం: భగవంతుడు సర్వాంతర్యామి అని చాటిన నారసింహావతారానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం శ్రీహరి.. స్తంభాన్ని చీల్చుకుని హిరణ్య కశ్యపుడిని సంహరించిన సంగతి పురాణాల ద్వారా తెలిసిందే.. ఇలాంటి నేపథ్యమే కళ్యాణదుర్గం పట్టణంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి ఉంది.

వేపచెట్టులో లక్ష్మీ నరసింహుడు..

కళ్యాణదుర్గంలోని కోటవీధులకు.. గుంటి, గండ్లూరు, వేదాద్రి, గడికోట, బావికట్ట వంశస్తులకు అవినాభావ సంబంధముంది. కర్నూలు జిల్లా అహోబిలం నరసింహస్వామిని తమ కుల దైవంగా పూజిస్తూ కొన్ని తరాలుగా అక్కడే స్థిర నివాసం ఏర్పరుచుకున్నారు. ఏళ్ల తరబడి మహిమాన్విత వేపచెట్టునే పూజించేవారు. కరువు, ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ప్రతి చిన్న శుభ కార్యానికి అహోబిలానికి వెళ్లలేక ఇక్కడి వారు ఇబ్బందులు పడేవారట. ఇలాంటి తరుణంలో కళ్యాణదుర్గం కోటలోని బోయ వీధిలోని ఓ వేపచెట్టులో తాను ఉన్నట్లు ఓ భక్తుడికి కలలో చెప్పాడని ఆలయ చరిత్ర చెబుతుంది. ఆనాటి నుంచి వేప చెట్టునే స్వామి ప్రతిరూపంగా కొలుస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. కాలక్రమంలో అక్కడ గుడిని కూడా కట్టించి, భక్తుల సౌకర్యార్థం అన్ని వసతులు కల్పించారు. గురువారం నరసింహస్వామి జయంతి సందర్భంగా రెండు రోజుల పాటు విశేష పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

2014లో ఆలయ పునర్ నిర్మాణం..

వంశస్తులలో ఒకరికి స్వప్నంలో కనిపించి ఎవరూ అహోబిలం రావాల్సిన అవసరం లేదని, తానే కోటలోని ఓ వేపచెట్టులో అవతరిస్తున్నట్లు చెప్పినట్లు ఆలయ చరిత్ర తెలుపుతోంది. దీంతో దాదాపు వందల సంవత్సరాల కిందట నుండి వేపచెట్టులో కొలువైన గుంటి నరసింహ స్వామిని అక్కడే కొలుస్తున్నారు. ఇక్కడి వేపచెట్టు కూడా పడుకున్న సింహంలా దర్శనమిస్తుండటం విశేషం. అనేక శతాబ్దాలుగా కేవలం వేపచెట్టుకు చుట్టు పక్కల కట్టకు మాత్రమే పూజలు జరుగుతున్న సందర్భంలో 1998లో లక్ష్మీ నరసింహస్వామి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాల ప్రతిష్ట జరిగింది. 2014లో ఆలయ పునర్ నిర్మాణం, ఇతర వసతులు కల్పించారు. గుంటి లక్ష్మీ నరసింహ స్వామి చారిటబుల్ ట్రస్టును కూడా ఏర్పాటు చేయడం జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా అహోబిల నారసింహుడే అనంతకు చేరి భక్తులను తరింపజేస్తున్నాడని ఇక్కడి భక్తుల నమ్మకం. నరసింహ జయంతి, శ్రీవారి కల్యాణోత్సవం, విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు ఏటా కనుల పండువుగా జరుగుతాయి. నాలుగేళ్ల కిందట శృంగేరి పీఠం ఉత్తరాధికారి విదుశేఖర భారతీ తీర్థ స్వామి వారు స్వయంగా ఇక్కడికి వచ్చి మహిమాన్విత వేపచెట్టును దర్శించుకున్నారు. స్వయంగా స్వామిని చూసిన అనుభూతి కలిగిందని తన అభిప్రాయాన్ని ఆలయంలో రాసి వెళ్లారు. అప్పటి నుండి ఇక్కడికి వచ్చే భక్తులకు ఉండటానికి తగిన వసతులు కల్పించారు.

నేడు కల్యాణోత్సవం

నృసింహ జయంతి సందర్భంగా ఆలయంలో గురువారం విశేష కార్యక్రమాలు జరగనున్నాయి. ఉదయం శ్రీవారి కల్యాణోత్సవం, సాయంత్రం నగరోత్సవం జరుగుతాయి. శాస్త్రీయ నృత్య నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ కార్యదర్శి జి.రమేష్ తెలిపారు.

కమనీయం.. కల్యాణోత్సవం



గిరిజా కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

బొమ్మనహాళ్: మండల పరిధిలోని ఎర్రగుడిలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ పనులు పూర్తి చేసిన గ్రామస్తులు బుధవారం శివపార్వతుల గిరిజా కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో భాగంగా ఉత్సవ విగ్రహాలకు ఏకదశ వార రుద్రాభిషేకం, ఆనందోత్సవం, శివపార్వతులకు వేదపండితులు శంకర్‌స్వామి, శశాంక్ బృందం కల్యాణం జరిపించారు. ఎమ్మెల్సీ శివ రామిరెడ్డి తనయుడు వై.భీమిరెడ్డి, సర్పంచ్ ప్రకాశ్‌రెడ్డి, ఎంఈఓ మల్లారెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజినేయులు, దుద్దేకుంట, నక్కలపల్లి సర్పంచులు రత్నమ్మ, రామిరెడ్డి తదితరులు పూజలు నిర్వహించారు.

రేపు వాహనాల వేలం

రాయదుర్గం: సెబ్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను శుక్రవారం ఉదయం 10 గంటలకు సెబ్ పోలీస్ స్టేషన్ వద్ద వేలంపాట నిర్వహిస్తున్నట్లు సెబ్ సీఐ జయనాథ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 5 వేలు రుసుము చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

ప్రపంచాన్ని మార్చే ఆయుధం చదువే



కళ్యాణదుర్గం: విద్యార్థినికి నియామక పత్రం అందజేస్తున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



రాయదుర్గం: విద్యార్థులకు నియామక పత్రం అందజేస్తున్న కాపు భారతి

- రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: పేదలందరూ ఉన్నత చదువులు చదవాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బోరంపల్లిలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉద్యోగ విజయోత్సవ సభను నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీధర్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. ప్రపంచాన్ని మార్చే శక్తి కేవలం ఒక్క చదువుకు మాత్రమే ఉందన్నారు. రాష్ట్రంలో పేదల తలరాతలు మారాలంటే విద్య ఒక్కటే సరైన మార్గమని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువు చదవాలన్న సంకల్పంతోనే జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్ యువతపై దృష్టి పెట్టారన్నారు. ఉన్నత విద్యతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను కల్పిస్తున్నారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొంది.. తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని సూచించారు. ఈ ఏడాది వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు పొందిన 37 మందికి నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ బిక్కి నాగలక్ష్మి, సర్పంచ్ శోభారాణి, నాయకులు కృష్ణారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, బలరాం, మంజునాథ్ రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, ఉమేష్ రెడ్డి, హనిమిరెడ్డి, రామ్మోహన్, హనుమంతరెడ్డి, అనీల్, శంకరయ్య, గంగాధర్, ఉమేష్, తిమ్మరాజు, అప్జల్ పాల్గొన్నారు.

పోటీ పరీక్షల్లో సత్తా చాటాలి..

రాయదుర్గం: విద్యతో పాటు నైపుణ్య రంగాల్లో కూడా శిక్షణ పొందితే ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి సతీమణి, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ చైర్‌పర్సన్ కాపు భారతి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఉద్యోగ విజయోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్య, ఉపాధి రంగాలపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. నాడు–నేడు కార్యక్రమం దేశానికే తలమానికంగా నిలిచిందన్నారు. ప్రభుత్వం రంగంలో 6 లక్షల ఉద్యోగాలిచ్చిన ఘనత కూడా జగన్‌కే దక్కిందన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో సమయం వృథా చేయకుండా సాధనలో కసరత్తు పెంచాలన్నారు. గతంతో పోల్చితే ఇప్పుడు స్కిల్ డెవలప్‌మెంట్ రంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమల్లోకి వచ్చాయన్నారు. కంప్యూటర్ పరిజ్ఞానాన్ని మెరుగుపరుచుకుని పోటీ పరీక్షల్లో సత్తా చాటాలన్నారు. అంతరం వివిధ కంపెనీలలో ఉద్యోగాలు సాధించిన 15 మంది విద్యార్థులకు నియామక పత్రాలను అందజేసి అభినందించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. కళాశాలలో 15 మంది ఉద్యోగాలకు ఎంపిక కావడం సంతోషానిచ్చిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ కొంతెం దేవరాజు పాల్గొన్నారు.





ఆంజనేయ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వ

పరామర్శ

వజ్రకరూరు: మండలంలోని చాబాల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మచ్చా ఆంజనేయ (48)అనారోగ్యంతో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మరణించాడు. బుధవారం ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ టి.రాజశేఖర్‌రెడ్డి తదితరులు చాబాల గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఆంజనేయ మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆంజనేయ మృతి వైఎస్సార్‌సీపీకి తీరని లోటు అన్నారు. సర్పంచు జగదీష్, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, ఉరవకొండ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణాయాదవ్, వజ్రకరూరు పీఏసీఎస్ అధ్యక్షుడు సుధీర్ రెడ్డి, మాజీ ఎంపీపీ రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీలు నారాయణప్ప, శివలింగప్ప, లేపాక్షి పాల్గొన్నారు.

అమ్మమ్మపై మనవడి దాడి

కణేకల్లు: అమ్మమ్మపై మనవడు దాడి చేసిన ఘటన మండలంలోని నల్లంపల్లి గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. నల్లంపల్లికి చెందిన గొల్ల మాలెమ్మకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. కూతురు సరోజమ్మను తమ్మప్పకు కిచ్చి వివాహం చేసింది. పెళ్లి సమయంలో కట్నకానుకల కింద రెండున్నర ఎకరాల భూమి ఇచ్చింది. మాలెమ్మ తన కుమార్తె అయిన సరోజమ్మ ఇంటి సమీపంలో నివాసముంటోంది. ఈ క్రమంలో ఆస్తి విషయమై తరచూ గొడవలు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం సరోజమ్మ కుమారుడు ప్రకాష్ ఆస్తి విషయమై అమ్మమ్మ అయిన మాలెమ్మతో గొడవ పడ్డాడు. మా అమ్మకు ఆస్తి చాలా తక్కువ ఇచ్చావ్.. కొడుక్కే ఎక్కువ ఇచ్చావంటూ మండిపడ్డాడు. ఆవేశంతో బండి గూటం తీసుకొని అమ్మమ్మపై దాడి చేశాడు. మాలెమ్మకు ఎడమ చేతితో పాటు తలకు దెబ్బలు తగిలాయి. రాయదుర్గం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోసకారి చంద్రబాబు

- మహిళల ఉసురులోనే టీడీపీ కొట్టుకుపోతుంది
- విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు లాంటి మోసకారి దేశ రాజకీయాల్లోనే మరెవ్వరూ ఉండబోరని రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. రుణమాఫీ పేరుతో మహిళలను వంచకు గురిచేసిన వీడియో క్లిప్‌లను చూపిస్తూ బుధవారం ఆయన మాట్లాడారు. డ్వాక్రా సంఘాలను ఆదుకుంటాను. అప్పులన్నీ బేషరతుగా మాఫీ చేసే బాధ్యత నేను తీసుకుంటానని బాబు హామీ ఇవ్వగా.. అప్పటి స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న పరిటాల సునీత రుణమాఫీపై మాట్లాడిన వీడియోను చూపించారు. ఆమె ఏమన్నారంటే.. 2014 నుంచి 2018 ఆర్థిక సంవత్సరంలో టీడీపీ ప్రభుత్వం ఎటువంటి డ్వాక్రా రుణాలను మాఫీ చేయలేదు. 2014 జూన్ నాటికి రూ.11,069 కోట్ల డ్వాక్రా రుణాలు ఉన్నాయి. వీటికి ఎటువంటి మాఫీ జరగలేదు. మాఫీ ప్రతిపాదన ప్రభుత్వ పరిధిలో లేదు. అని చెప్పిన వీడియోలను చూపించారు. అనంతరం విప్ కాపు మాట్లాడుతూ.. రాజకీయాల్లో 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు మహిళలను ఏ విధంగా మోసం చేశారో వీడియోలే సాక్షాలుగా నిలిచాయన్నారు. కంప్యూటర్, మొబైల్‌ఫోన్ నేనే కనిపెట్టాను. పీవీ సింధూకు బ్యాడ్మింటన్ నేర్పింది.. సత్యానాదేళ్లకు చదువు చెప్పించింది.. కరోనాకు మందు కనిపెట్టిన వ్యక్తి కూడా నేనే అంటూ అబద్దాలు చెప్పే మోసకారి బాబు అని ధ్వజమెత్తారు.

కాలవ సమాధానం చెప్పాలి..

డ్వాక్రా రుణమాఫీ పేరుతో మాటిచ్చి తప్పించుకోవడంతోనే 2019 ఎన్నికల్లో మహిళా మణులు చావు దెబ్బతీశారని విప్ కాపు ఆరోపించారు. 2024 ఎన్నికల్లో వారి ఉసురులోనే టీడీపీ కొట్టుకుపోవడం ఖయమన్నారు. నిత్యం నీతులు వల్లే కాలవకు ఇలాంటివి కనిపించవా అని నిలదీశారు. కాలవ నీది మానవ జన్మఅయితే సమాధానం చెప్పాలని ఘాటుగా సందించారు. లేదంటే వారిని మోసం చేసిన ద్రోహులుగానే చరిత్రలో నిలిచిపోతారని ఎద్దేవా చేశారు.

కార్పొరేట్ స్కూళ్లను సీజ్ చేయాలి

రాయదుర్గంటౌన్: ముందస్తు అడ్మిషన్ల పేరుతో భారీ ఎత్తున బ్యానర్లతో ప్రచారం చేసుకుంటున్న ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ అధ్యక్షుడు అంజి, ఏఐవైఎఫ్ ప్రధాన కార్యదర్శి కొట్రేష్ డిమాండ్ చేశారు. పట్టణంలో పలు స్కూళ్లకు చెందిన బ్యానర్లను చించి నిరసన తెలిపారు. ముందస్తు ప్రచారం, అడ్మిషన్లు చేస్తే చర్యలు తీసుకుంటామని డీఈఓ జీఓలు ఇచ్చినా ఇక్కడ అమలు కావడం లేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత స్కూళ్లు, కళాశాలలపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

సంక్షిప్త సమాచారం

ఘనంగా గంగవరేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట

కుందుర్పి: మండలంలోని తూముకుంట గ్రామంలో బుధవారం ఉదయం నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగవరేశ్వర స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంతకుముందు హోమం అనంతరం గ్రామంలో స్వామి విగ్రహాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బసవరాజు, నాయకులు గంగాధర, తిమ్మరాజు పాల్గొన్నారు.

దళిత సమస్యలపై పోరాటం

కళ్యాణదుర్గం: ఉమ్మడి జిల్లాల్లో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయడానికి అందరూ సన్నద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధికారి ప్రతినిధి అక్కులప్ప పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గామాల్లో యువతను చైతన్యం చేయాలన్నారు. గ్రామ కమిటీలను నియమిస్తూ సంఘాన్ని బలోపేతం చేయడానికి ముందుకు రావాలన్నారు. అనంతపురం జిల్లా అధ్యక్షుడు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, ఉమ్మడి జిల్లాల ఉపాధ్యక్షుడు టైగర్ వన్నూరుస్వామి, తిమ్మరాజు పాల్గొన్నారు.

సరిహద్దులో గట్టి బందోబస్తు

విడపనకల్లు: ఎస్పీ శ్రీనివాస రావు దేశాల మేరకు కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేసినట్లు గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప పేర్కొన్నారు. బుధవారం డొనేకల్లు, విడపనకల్లు చెక్ పోస్టుల వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీ కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల జరుగుతున్న నేపథ్యంలో హావళిగి, డొనేకల్లు, 42వ జాతీయ రహదారిలో ఉన్న విడపనకల్లు మోడల్ స్కూల్ వద్ద ప్రత్యేకంగా మూడు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామన్నారు.

గుమ్మఘట్ట: చెక్‌పోస్టుల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు ఎస్ఐ సునీత బుధవారం తెలిపారు. మండలంలోని కె.పి.దొడ్డి గ్రామంలో ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు.

బొమ్మనహాళ్/శెట్టూరు: బొమ్మనహాళ్ సరిహద్దు చెక్‌పోస్టును ఎస్ఐ శివ పరిశీలించారు. శెట్టూరు మండలంలోని శెట్టూరు,తిప్పనపల్లి చెక్ పోస్టులను డీఎస్పీ బీ.శ్రీనివాసులు తనిఖీ చేశారు. వాహనాల రాకపోకల వివరాలను నమోదు చేసిన రికార్డులను పరిశీలించారు. ఎస్ఐ యువరాజ్ పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి వేళాయె..



కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

- నేడు 'ఆదర్శ భారతి సొసైటీ' షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం
- హాజరుకానున్న ప్రభుత్వ విప్ కాపు

కణేకల్లు: కణేకల్లులోని ఆదర్శ భారతి రైతు సేవా సహకార సంఘం సొసైటీలకు ఆదర్శంగా నిలుస్తోంది. పరపతేతర సేవలతో లాభాల బాటలో పయనిస్తున్న ఈ సొసైటీ.. కొత్త షాపింగ్ కాంప్లెక్స్ (వ్యాపార సముదాయాలు)ల నిర్మాణంతో మరో అడుగు ముందుకేసింది. ఆదర్శ భారతి సొసైటీని మరింత అభివృద్ధి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు కె.ప్రకాష్‌రెడ్డి చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. కణేకల్లు పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ సొసైటీ చుట్టూ ఖాళీ స్థలం చాలా ఉండేది. ఖాళీ స్థలం అలాగే ఉంచితే ఎలాంటి ప్రయోజనం లేదని ఈ స్థలంలో ఏదో ఒక నిర్మాణం చేపట్టి సొసైటీకి ఆదాయం వచ్చేలా చేస్తే శాశ్వతంగా ఆదాయం పొందవచ్చని సొసైటీ అధ్యక్షుడు ఆలోచించి ఈ విషయాన్ని విప్ కాపు దృష్టికి తీసుకెళ్లారు. విప్ సలహా మేరకు సొసైటీ చుట్టూ వివిధ వ్యాపారస్తుల కోసం 10 షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మించాలని నిర్ణయించారు. అక్టోబర్ 31, 2022లో రూ.56 లక్షల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. పనులన్నీ శరవేగంగా చేయడంతో కాంప్లెక్స్ పనులన్నీ పూర్తయ్యాయి.

ఏటా అదనంగా రూ.5 లక్షల ఆదాయం

ఆదర్శ భారతి రైతు సేవా సహకార సంఘానికి జిల్లాతో పాటు రాష్ట్రంలో కూడా మంచి గుర్తింపు ఉంది. లోన్స్, పరపతేతర సేవలతో ఏటా రూ.60 లక్షల వరకూ సొసైటీకి లాభం రానుంది. ఆదాయం బాగా వస్తుండటంతో సభ్యులకు ఏటా 10 శాతం డివిడెండ్ కూడా అందించడం ఈ సొసైటీ ప్రత్యేకత. కొత్తగా నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌లతో ఏటా రూ.5 లక్షల వరకూ ఆదాయం సమకూరనుంది. కొత్తగా నిర్మించిన 10 షాపింగ్ కాంప్లెక్స్‌లను గురువారం రాష్ట్ర ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి ప్రారంభించనున్నట్లు ఆదర్శ భారతి రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు కె.ప్రకాష్‌రెడ్డి, ఎంపీ మనోహర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతితో పాటు లీడ్ బ్యాంకు మేనేజర్ నాగరాజు రెడ్డి, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ ఆఫీసర్ జితేంద్రకుమార్ మిశ్రా, జిల్లా కో–ఆపరేటివ్ ఆఫీసర్ ఎం.ప్రభాకర్‌రెడ్డి హాజరవుతారన్నారు.